క్లుప్తంగా

నేడు దేచవరానికి మంత్రి అంబటి రాక

నకరికల్లు: మండలంలోని దేచవరం, రూపెన గుంట్ల గ్రామాల్లో సోమవారం నిర్వహించనున్న కార్యక్రమాల్లో రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు హాజరవుతారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆదివారం తెలిపారు. దేచవరం గ్రామంలో జగనన్న పాల వెల్లువ, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల ప్రారంభించనున్నట్లు చెప్పారు.

చల్లగుండ్లలో ముస్లింల ప్రార్థనలు

నకరికల్లు: మండలంలోని చల్లగుండ్లలో మండల స్థాయి దీని ఇజ్‌తిమాను ముస్లింలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏడాదికి ఒకసారి ప్రతి గ్రామంలోని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు జరుపుకుంటారు. ప్రపంచశాంతి కోసం దువా చేశారు.

డెంగీ లక్షణాలతో బాలుడి మృతి



పెదకూరపాడు: డెంగీ లక్షణాలతో బాలుడు మృతి చెందిన ఘటన కన్నెగండ్లలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. తండ్రి సురేష్ తెలిపిన వివరాలు.... నాలుగు రోజుల కిత్రం గ్రామానికి చెందిన గోగులపాటి యశ్వంత్(15) తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. వాంతులు, విరేచనాలు అధికం కావడంతో గుంటూరులోని ప్రైవేట్ వైద్యశాలకు గత బుధవారం తరలించారు. అక్కడ వైద్యులు డెంగీగా నిర్ధారించినట్లు వివరించారు. మృతుడి మతిస్థిమితం లేకపోవడంతో వ్యాధి గుర్తించలేకపోయినట్లు చెప్పారు. అక్కడ నుంచి జీజీహెచ్‌కి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ యశ్వంత్ మృతి చెందాడు. యశ్వంత్ మృతి వార్త తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు, క్రోసూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, జిల్లా పార్టీ కార్యదర్శి కంకణాల శివాజీ, సచివాలయ కన్వీనర్ మాగులూరి అనిల్‌కుమార్ మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

నేడు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం

సత్తెనపల్లి: నియోజకవర్గంలోని రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశం ఈ నెల 14న ఉదయం 11 గంటలకు పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎస్.సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారి అధ్యక్షత వహించనున్నట్లు పేర్కొనారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు అందరూ హాజరుకావాలని కోరారు.

మాజీ కౌన్సిలర్ గంటా వెంకయ్యకు పితృ వియోగం

సత్తెనపల్లి: పట్టణంలోని 15వ వార్డు మాజీ కౌన్సిలర్ గంటా వెంకయ్య తండ్రి వెంకట్రావు(75) ఆదివారం మృతి చెందారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆయన స్వగృహానికి వెళ్లి వెంకట్రావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే హీరా ఫ్లెక్సీ అధినేత కరిముల్లా తాతయ్య షేక్ సైదా(58)మృతి చెందారు. మంత్రి అంబటి రాంబాబు సైదా మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రి వెంట వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షులు అచ్యుత శివప్రసాద్, వార్డు నాయకులు లోక మాధవ్, గంటా ఏసుబాబు ఉన్నారు.

మహంకాళీ అమ్మవారి ఆలయానికి రూ.లక్ష విరాళం



నరసరావుపేట రూరల్: ఇసప్పాలెంలో వేంచేసియున్న మహంకాళీ అమ్మవారి దేవస్థాన పునర్నిర్మాణం కోసం సత్తెనపల్లికి చెందిన ఈశ్వర్ రైస్ ట్రేడర్స్ అధిపతి దేవత రామజోగి, ఝాన్సీలక్ష్మి దంపతులు రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఆలయ కార్యాలయంలో కార్యనిర్వాహణాధికారి టి.సుధాకరరెడ్డికి చెక్కు అందజేశారు. దేవస్థానానికి విరాళం ఇచ్చే దాతలకు ఆదాయపు పన్ను సెక్షన్ 80జి కింద పన్ను మినహాయింపు లభిస్తుందని ఈఓ తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

నరసరావుపేట టౌన్: ఆర్థిక సమస్యలతో వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామిరెడ్డిపేటకు చెందిన మారెపల్లి నవీన్(38) ఎస్ఎస్అండ్ఎన్ కళాశాలలో అటెండర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం మారుతి కుమారిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆదివారం ఉదయం ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ ఎన్.వెంకటేశ్వరరావు, సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కాగా తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నట్లు మృతుడి తల్లి అరుణ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇంటికే మెరుగైన వైద్యం

- ఫ్యామిలీ డాక్టర్ కింద 22,848 మందికి వైద్యం
- ఆనందం వ్యక్తం చేస్తున్న షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులు



పెదకూరపాడులో ఫ్యామిలీ డాక్టర్‌లో భాగంగా ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందిస్తున్న వైద్య బృందం

పెదకూరపాడు: పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్, పేదలకు వరంలా మారింది. పెదకూరపాడు మండలంలోని 20 గ్రామాల్లో ఇప్పటి వరకూ 22,848 మందికి సేవలు అందించారు. ఇక షుగర్, బీపీ రోగులకు నెలవారీ వైద్య పరీక్షలు, మందులు కొనుగోలు భారం తగ్గింది. 104 వాహనంలోనే ప్రతి నెల వారికి పరీక్షలు చేసి, ఉచితంగా నెలకు సరిపడా మందులు ఇస్తున్నారు.

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు....

మండలంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా వైద్యం దరిచేరుతోంది. మండంలలో మొత్తం 14 హెల్త్ క్లినిక్‌లు నిర్మాణాలు పూర్తి కానున్నాయి. ఈ క్లినిక్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, మిడ్ లెవెల్ ప్యావెడర్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్త ఉంటారు. వీరు ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలు తదితరులకు వైద్య సేవలు అందిస్తారు.

సీహెచ్‌సీలో ఆరోగ్యశ్రీ సేవలు....

పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం నందు ఈ నెల నుంచి ఆరోగ్య శ్రీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఇక్కడ ఓపీ మరింత పెరిగే అవకాశం ఉంది. ఫిజిషియన్, జనరల్ సర్జన్, డెంటల్ సర్జన్, పిల్లల వైద్య నిపుణులు, మత్తు డాక్టర్, స్త్రీ వ్యాధి నిపుణులు అందుబాటులో ఉన్నారు. ఇటీవల కాలంలో పెదకూరపాడు సీహెచ్‌సీలో అరుదైన శస్త్ర చికిత్స చేసి 4 కిలోల వరి బీజం తొలగించారు.

వైద్యానికి చింతలేదు..



ప్రతి నెలా వైద్య బృందం గ్రామాలకు వచ్చి రక్త, మూత్ర పరీక్షలు చేస్తున్నారు. ఉచితంగా మందు లు ఇచ్చారు. వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రులకి వెళ్లే అవసరం లేదు. ఫ్యామిలీ డాక్టర్‌తో మాకు మేలు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల వైద్యంపై ఎంతో శ్రద్ధ చూపుతున్నారు. సీఎంకు ధన్యవాదాలు.

–బత్తుల కోటేశ్వరరావు, లగడపాడు

ఫ్యామిలీ డాక్టర్ వరం...



ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం పల్లె ప్రజలకు వరం. ఎంతో మంది దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నాం. క్యాన్సర్ రోగులు కూడా ఉన్నారు. ఇంటికి వెళ్లి వైద్యం చేస్తుంటే వారి కళ్లలో ఆనందం కనిపిస్తుంది. ఎక్కడ లేని విధంగా ఇలాంటి కార్యక్రమాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే సాధ్యం.

–డాక్టర్ ప్రియాంక, 75త్యాళ్లూరు వైద్యాధికారి

ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థను బలోపేతం చేద్దాం



రూరల్ పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ పల్లపురాజు

మాచర్ల రూరల్: శాంతి భద్రతల పరిరక్షణలో ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా ఎప్పటికప్పుడు కేసులు పరిష్కరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని గురజాల డీఎస్పీ పల్లపురాజు కోరారు. ఆదివారం రూరల్ పోలీసు స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులను పరిశీలించి ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో నిఘా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ప్రజలతో మమేకమై స్నేహపూరిత వాతావరణంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. రూరల్ స్టేషన్ పరిధిలో ఎటువంటి పెండింగ్ కేసులు లేకుండా విధులు సక్రమంగా నిర్వహిస్తున్న ఎస్ఐ, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ షమీముల్లా, ఎస్ఐ కె. రాజశేఖర్, రైటర్ కళ్యాణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన పై శాంతి ర్యాలీ



శిరిగిరిపాడు బస్టాండ్ సెంటర్‌లో శాంతి ర్యాలీ చేస్తున్న పాస్టర్లు

వెల్దుర్తి: మణిపూర్‌లో చోటుచేసుకున్న దుర్ఘటనలపై మండలంలోని శిరిగిరిపాడులో ఆదివారం లూథరన్ చర్చి రెవ. మరియానంద్ ఆధ్వర్యంలో స్థానిక పాస్టర్లు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మరియబాబు మాట్లాడుతూ మణిపూర్‌లో ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. క్రిస్టియన్ మహిళలపై ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్రప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్వాతంత్ర్య భారత దేశంలో మాయని మచ్చ అన్నారు. భిన్నత్వంలో ఏకత్వమైన దేశంలో క్రిస్టియన్లపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘటన జరిగి మూడు నెలలైనప్పటికీ ఇంకా దాడులు కొనసాగుతున్నాయని, ఇప్పటికైనా దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని వారికి న్యాయం చేయాలన్నారు. లూథరన్ చర్చి నుంచి బస్టాండ్ వరకు స్థానిక పాస్టర్లు, సంఘ సభ్యులతో శాంతి ర్యాలీ నిర్వహించారు.

సాగర్‌మాత ఆలయంలో ప్రత్యేక పూజలు



సాగర్‌మాత ఆలయ ప్రాంగణంలో తేరు ప్రదక్షణలో పాల్గొన్న భక్తులు

విజయపురిసౌత్: నిండు మనస్సుతో మరియతల్లిని ప్రార్థిస్తే భక్తులకు దీవెనలు అందుతాయని సాగర్ మాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ అన్నారు. సాగరమాత ఆలయంలో ఆదివారం ఉదయం జరిగిన దివ్యబలిపూజా కార్యక్రమంలో భక్తులనుద్దేశించి ప్రసంగించారు. సమాజంలో తోటివారిని ప్రేమిస్తూ నీతివంతమైన జీవితం గడపాలని ఉద్బోధించారు. దీనికి ముందు మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షిణ నిర్వహించారు. ఆ తరువాత జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ

గురజాల: ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగి పలువురికి గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని పులిపాడు గ్రామానికి చెందిన తమ్మిశెట్టి కొండలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు మనవడు తమ్మిశెట్టి నవీన్‌పై ప్రమాదశాత్తు విద్యుత్ స్తంభం పడి మృతి చెందాడు. తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు తమ్మిశెట్టి శ్రీను వద్దకు వచ్చి వ్యవసాయ పనిమూట్లు కావాలని అడగ్గా వస్తువుతో నాకు పనివుందని శ్రీను సమాధానం చెప్పాడు. తమ్మిశెట్టి శ్రీను పనిమూట్లు ఇవ్వలేదని మనస్సులో ఉంచుకుని వెంకటేశ్వర్లు తన కుమారులు గోవిందరాజు, నరసింహారావులకు చెప్పడంతో గత కొద్ది రోజులుగా వారి కుటుంబాల మధ్య వివాదం చోటుచేసుకుంటుంది. గత రెండు రోజులుగా జరుగుతున్న గొడవలను మనస్సులో ఉంచుకుని 13వ తేదీ ఉదయం తమ్మిశెట్టి కొండలు ఇంటి వద్ద ఉండగా తమ్మిశెట్టి గోవిందరాజు, నరసింహరావులు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, లింగమ్మ, ఓర్సు శ్రీను, శ్రీహరి దుర్గా ప్రసాద్, నంద్యాల శివలింగా, దేవి వీరు అందరూ కలిసి కర్రలు తీసుకుని తనతో గొడవ పెట్టుకుని దాడి చేసిన్నట్లు చెప్పారు. తనపై దాడి చేస్తుండగా బంధువులు అయిన తమ్మిశెట్టి నాగరాజు, టి.శ్రీహరి మంగ, పుల్లయ్య, రమణకుమారి మరియు కొందరు అడ్డుకున్నట్లు తెలిపారు. ప్రథమ చికిత్స కోసం గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించిన్నట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతోనే....

పులిపాడు గ్రామంలో చోటుచేసుకున్న గొడవ కేవలం వారి ఇరువురి కుటుంబ కలహాల నేపథ్యంలో జరిగింది. ఇందులో ఎలాంటి రాజకీయ కోణంలో ఏమి జరగలేదని ఎస్ఐ బి. అనంత కృష్ణ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం ఎస్ఐ మాట్లాడుతూ గత కొంతకాలంగా వారి ఇరువురి కుటుంబాల మధ్య మాటలు లేవని, కొంత కాలంగా వారి మధ్య గొడవలు ఉన్నాయని అంతేకాని కొన్ని పార్టీలు రాజకీయ కోణంలో అసత్య ప్రచారం చేస్తున్నారని ఎవరూ కూడా ఈ విషయంపై రాజకీయం చేయవద్దని ఎస్ఐ హెచ్చరించారు.

ఆరోగ్యమిత్రల వేతనాలు పెంచాలి

వినుకొండ(నూజెండ్ల): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రల జీతాలను పెంచి వారిని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య మిత్ర దళిత గిరిజన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని సమైక్య కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా ఆరోగ్యమిత్రలుగా పనిచేస్తున్నామని, చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అదేవిధంగా ఆరోగ్య మిత్రలకు ప్రమోషన్లు కల్పించాలని, 35 సెలవులతో కూడిన స్పెషల్ లీవులు మంజూరు చేయాలని, జిల్లా హాస్పిటల్, ఏరియా హాస్పటల్స్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ల్లో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలకు కూడా ఇన్సెంటివ్స్ కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాకాని అప్పారావు, ప్రధాన కార్యదర్శి డి.రాంబాబు, రాష్ట్ర కార్యదర్శి జడ్డా కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పులిచింతల ప్రాజెక్టు సందర్శన



సత్తెనపల్లి: పులిచింత ప్రాజెక్ట్‌ను పెదకూరపాడు నియోజకవర్గంలోని అచ్చంపేట మండలం మాదిపాడు సత్తెమ్మతల్లి దర్శనానికి వెళ్లిన వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచులు ఆదివారం సందర్శించారు. వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పెండెం బాబూరావు, సత్తెనపల్లి మండల పరిషత్ అధ్యక్షురాలు షేక్ ఎలవర్తిపాటి జైబూన్ బీ, ఈసాల నేతృత్వంలో ప్రాజెక్ట్‌ను సందర్శించారు. కార్యక్రమంలో నాయకులు బొబ్బిలి, కొరివి అనిల్ కుమార్, తొరటి తిరుపతయ్య, ఏడుకొండలు, గుంజి విజయకుమార్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వీవీ అబాకస్‌లో రెడ్డి కృష్ణ ప్రతిభ



సత్తెనపల్లి: జిల్లా స్థాయి వీవీ అబాకస్‌లో సత్తెనపల్లికి చెందిన రెడ్డి కృష్ణ ప్రతిభ కనబరిచాడు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో వీవీ అబాకస్(గణిత శాస్త్రంలో) జిల్లా స్థాయిలో చాంపియన్ షిప్ ఒకటో ర్యాంక్, రెండో ర్యాంక్ పోటీలు ఆదివారం నిర్వహించారు. పోటీలలో సత్తెనపల్లికి చెందిన రెడ్డి కృష్ణ వికాస్ చాంపియన్ షిప్ కైవసం చేసుకున్నాడు. చాంపియన్ షిప్ గెలిచిన విద్యార్థికి వీవీ అబాకస్ జిల్లా డైరెక్టర్ వి.శివశేఖర్, జిల్లా ఇన్‌చార్జి శివ నాగేంద్రం మెడల్ ట్రోఫీ, ప్రశంసా పత్రం అందజేశారు.

సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి ప్రెసిడెంట్‌గా సురేష్ కుమార్

సత్తెనపల్లి: సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి ప్రెసిడెంట్‌గా బలిజేపల్లి సురేష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని 8వ వార్డు క్రిస్టియన్ పేటలోని సెంటినరి తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. సెక్రటరీగా కాకిజాలయ్య, ట్రెజరర్‌గా గుజ్జర్లపూడి రూబేను, వైస్ ప్రెసిడెంట్‌గా జొన్నలగడ్డ హుసేన్, వైస్ సెక్రటరీగా గంధం మోజెస్, వైస్ ట్రెజరర్‌గా నందిగం వెంకయ్య, కమిటీ మెంబర్లుగా గుజ్జర్లపూడి రోజిబాబు, కోట దేవరాజ్, గుజ్జర్లపూడి సాగర్, కొత్తపల్లి రవికుమార్, గుజ్జర్లపూడి యేసేబు, గుజ్జర్లపూడి దినకర బాబు, గుజ్జర్లపూడి అనిల్ కుమార్, చింతపల్లి అజయ కుమార్, దేవరకొండ ఏసురత్నం, పేరు పోగు శ్యాంబాబు లను ఎన్నుకున్నారు.

పుస్తకం విద్యార్థులకు ఓ మంచి నేస్తం

రెంటచింతల: విజ్ఞానాన్ని అందించే పుస్తకం విద్యార్థులకు ఓ మంచి నేస్తం అని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. ఆదివారం స్థానిక ఏపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్ఆర్ఐవిపి (ప్రవాస భారతీయ వాసవి సంఘం) నేతృత్వంలోని పుస్తక మిత్రద్వారా రూ. 35 వేల విలువైన 900 పుస్తకాలను గిరిజన పాఠశాలకు అందచేయడం అభినందనీయమన్నారు. ఈ పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించాలన్నారు. మంచి మంచి పుస్తకాలను చదువుకుని విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకుని వివిధ రంగాల్లో ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. డాక్టర్ సీఏ ప్రసాద్ విద్యార్థులకు ఆటపాటలతో సులభ పద్ధతిలో భాష నేర్చుకోవడంవల్ల మంచి ఉజ్వల భవిషత్ ఉంటుందన్నారు. ప్రతిరోజు పాఠశాలలోని గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఎస్. మోహన్, వైస్ ప్రిన్సిపల్ పీడి వరప్రసాద్, ఉపాధ్యాయులు ఎస్ భాగ్యమేరి, జె.కృష్ణనాయక్, షేక్ సుభాని, కెవి నారాయణమ్మ, పి.సత్తాజ్ బేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో యర్రంకు సముచిత స్థానం

- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- మాజీ ఎమ్మెల్యే యర్రం జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే యర్రం, పక్కన మంత్రి అంబటి, నిమ్మకాయల, సూరిబాబు

సత్తెనపల్లి: రెండుసార్లు సత్తెనపల్లి ఎమ్మెల్యేగా, ప్రతి గ్రామంలోనూ మంచి పరిచయాలు ఉన్న మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వర రెడ్డి వైఎస్సార్ సీపీలో చేరి స్వగృహంలోకి ప్రవేశించారని, మన పార్టీ కార్యాలయంలో ఆయన జన్మదిన వేడుకలు జరుపుకోవడం సంతోషకరమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. వెంకటేశ్వర రెడ్డి జన్మదినాన్ని పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ ఇక్కడ పోటీ చేసేది నేనేనని, ఎవరికైనా అనుమానాలు ఉంటే తొలగించుకోవాలని, ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి యర్రానికి సముచిత స్థానాన్ని కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ నియోజక వర్గంలో పదేళ్లు ఎమ్మెల్యేగా పారదర్శకంగా పనిచేశానని, అనుకోని పరిస్థితుల్లో ఇతర పార్టీలో చేరాల్సి వచ్చిందన్నారు. మొదటి నుంచి జగన్‌కు అండగా ఉన్న వారిలో నేను ఒకరినని యర్రం వెంకటేశ్వరరెడ్డి వివరించారు. 2024లో మూడోసారి పోటీ చేస్తున్న అంబటి రాంబాబుని గెలిపించేందుకు మనమందరం సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు, నాయకులు రాయపాటి పురుషోత్తమరావు, అచ్యుత శివప్రసాద్, మర్రి సుబ్బారెడ్డి, ఎమ్‌జేఎమ్ రామలింగారెడ్డి, సహారా మౌలాలి,రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అవినీతిలో ఘనపాటి... కొమ్మాలపాటి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెదకూరపాడు: ఇసుక, మద్యం, మట్టి, గ్రావెల్ దోచుకోవడంతో పాటు అవినీతి లో ఘనపాటి కొమ్మాలపాటి శ్రీధర్ అని వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆదివారం నిర్వహించారు. క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైస్ ఎంపీపీ షేక్ చాంద్‌బాషా, పార్టీ మండల కన్వీనర్ మస్తాన్ షరీఫ్, పార్టీ జిల్లా కార్యదర్శి కంకణాల శివాజీ, సచివాలయ కన్వీనర్ మాగులూరి అనిల్‌కుమార్, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ భయంకర్ సుభాని, ఎస్సీ సెల్ నాయకులు అచ్యుత్‌రావు, మైనార్టీ సెల్ నాయకులు షేక్ బాజి, బీసీ సెల్ అధ్యక్షుడు యమార్తి మస్తాన్‌రావు మాట్లాడారు. లోకేష్ పాదయాత్ర సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావుపై చేసి వ్యాఖ్యలను ఖండించారు. అభివృద్ధిపై మాట్లాడకుండా మేము వైఎస్సార్ సీపీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు అధికారంలోకి వస్తే మేము చేస్తామని లోకేష్ జెప్పడం రాజకీయ అవగాహన రాహిత్యమన్నారు. యువగళానికి జన స్పందన లేకపోవడంతో మహిళలకు చీరలు, నగదు, పురుషులకు మద్యం, పెట్రోల్ పోయించి తరలించారన్నారు. స్థానికుడుగా ఉన్న కొమ్మాలపాటి రెండు సార్లు ఎమ్మెల్యేగా ఉండి ఎం అభివృద్ధి చేస్తారో సెల్ఫీ ద్వారా ప్రజలకు చూపించాలని సవాల్ విసిరారు. కొమ్మాలపాటి ఇంటి ముందు రోడ్డు మేమే వేశామని గుర్తుచేశారు. పెదకూరపాడును అభివృద్ధి చేసింది వైఎస్సార్ సీపీనే అన్నారు. దమ్ముంటే టీడీపీ తరఫున టిక్కెట్ తెచ్చుకోని ప్రజాక్షేత్రంలో పోరాడాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు పచ్చల ఆనందరావు, నల్లపాటి యోహన్, సాతులూరి రాజు, ఎంపీటీసీలు షేక్ బాజి, గోవిందరావు, బత్తుల రాజేంద్ర, కరిముల్లా పాల్గొన్నారు.

వెరికోస్ వెయిన్స్ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



ఎవిస్ హాస్పిటల్ నిర్వాహకులను సత్కరిస్తున్న రోటరీక్లబ్, పట్టణ ఆర్యవైశ్య సంఘ నాయకులు

సత్తెనపల్లి: వెరికోస్ వెయిన్స్ వ్యాధికి సంబంధించి ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి, పట్టణ ఆర్యవైశ్య సంఘం సంయుక్తంగా ఎవిస్ హాస్పిటల్ హైదరాబాద్ సహకారంతో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక శాంతినికేతన్ జూనియర్ కాలేజ్ ఆవరణలో నిర్వహించిన శిబిరంలో 76 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. నరాలు ఉబ్బినట్లు, సాగినట్లు ఉండటం, కాళ్ల మీద నల్లటి మచ్చలాగా ఏర్పడటం ఈ వ్యాధి లక్షణాలని, వీటిని ప్రత్యేక సర్జరీ ద్వారా తొలగించవచ్చునన్నారు. ఇది అంత ప్రమాదకరమైన వ్యాధి కాదని వివరించారు. అనంతరం వైద్యశాల నిర్వాహకులను సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు మాతంగి సాంబశివరావు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఆత్మకూరి వెంకట హరే రామ చెంచయ్య, రోటరీ క్లబ్ జోనల్ చైర్మన్ బెల్లంకొండ నాగసాయి ప్రసాద్, అసిస్టెంట్ గవర్నర్ బాపతు శ్రీనివాసరెడ్డి, కట్టమూరు అప్పారావు, రోటరీ క్లబ్ సెక్రటరీ సరికొండ రమాదేవి, ట్రెజరర్ వనమా నాగేశ్వరరావు, సభ్యులు పెరుమాళ్ల లక్ష్మీ శివన్నారాయణ, కాపుగంటి రత్తయ్య, మధిర వెంకటేశ్వర రెడ్డి, ఎవిస్ హాస్పిటల్ సిబ్బంది శ్రీనివాసరావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అర్హులకు ఓటు హక్కు కల్పించాలి



మాదలలో ఓటర్ల జాబితా సర్వే ను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎం.భవానీశంకర్

ముప్పాళ్ల: యువతి, యువకుల(18 సంవత్సరాలు నిండిన)కు ఓటు హక్కు కల్పించాలని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ చెప్పారు. మండలంలోని తొండపి, మాదల, బొల్లవరం, రుద్రవరం గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ల జాబితాల ఇంటింటి తనిఖీ ఆదివారం పరిశీలించారు. ఇంటింటి సర్వేలో మృతి చెందిన వారిని గుర్తించి వారి ఓటును తొలగించేలా చూడాలన్నారు. ఓటరు గుర్తింపు కార్డులో ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే ఫారం–8 ద్వారా సవరించాలని సూచించారు. డబుల్ ఎంట్రీ ఓటర్లను పారదర్శకంగా విచారణ జరిపి జాబితాల నుంచి తొలగించాలని కోరారు. సర్వే పూర్తయిన తర్వాత నూతన ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని, ప్రతి బీఎల్ఓ రిజిస్ట్రార్‌ను నిర్వహించుకోవాలన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు చేయూత



చిలకలూరిపేట టౌన్: ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్య విద్యార్థులకు ఆవోపా ఏపీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చేయూతనందిస్తుందని సంఘ అధ్యక్షుడు గార్లపాటి సత్యనారాయణ చెప్పారు. ఆదివారం ఆర్యవైశ్య విద్యానిధి కార్యదర్శి మాజేటి నరేంద్ర కుమారుడు చక్రవర్తి రూ. 50వేలను ఎడ్యుకేషనల్ ట్రస్టుకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో గత కొన్ని సంవత్సరాలుగా ఎంతో మంది పేద ఆర్యవైశ్య విద్యార్థులకు సహాయం అందించినట్లు తెలిపారు. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. సంఘ ప్రధాన కార్యదర్శి పొట్టి శ్రీరాములు, కోశాధికారి చింతా కృష్ణారావు, సభ్యులు సామా శ్రీనివాస్, కొలిశెట్టి శరత్, ఎం.నాగేశ్వరరావు, మాజేటి చక్రవర్తి పాల్గొన్నారు.